ఈనాడు
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం అక్టోబరు 22, 2024

అమరవీరుల త్యాగాలు మరవలేనివి..


పోలీసు అమరవీరుల స్థూపం వద్ద మౌనం పాటిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే


హనుమకొండ : మొగుళ్లపల్లిలో 1999లో పోలీసులు, నక్సల్స్ మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో చనిపోయిన వహీద్‌ఖాన్‌కు నివాళులర్పిస్తున్న ఆయన మనుమరాలు, సమీప బంధువు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : విధి నిర్వహణ.. దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం 'పోలీసు ఫ్లాగ్ డే'ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్‌లో భాగంగా కలెక్టర్, ఎస్పీ కిరణ్ ఖరే, ఓఎస్డీ బోనాల కిషన్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, తదితర అధికారులు పోలీసు అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి మౌనంగా నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా అవసరాలు, సంక్షేమం కోసం ఏర్పడిన వ్యవస్థ పోలీసు శాఖ అని పేర్కొన్నారు. అదేవిధంగా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, దేశ అంతర్గత భద్రత, ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం పోలీసు వ్యవస్థ కీలకంగా పని చేస్తుందన్నారు. ఈ నెల 31 వరకు ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. 1959 నుంచి పోలీసు అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ క్రమం తప్పకుండా ఏటా అక్టోబరు 21న పోలీసు ఫ్లాగ్ డేను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో దశాబ్దాల క్రితం మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేదని, జిల్లా పరిధిలో 18 మంది పోలీసులు సంఘ విద్రోహశక్తులతో పోరాడి చిరస్మరణీయులైన విషయాన్ని గుర్తు చేశారు. పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో ఎస్పీ సమావేశం నిర్వహించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, నారాయణనాయక్, జిల్లా పరిధిలోని సీఐలు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న పోలీసు సిబ్బంది

ని'వేదనలివే'..!


అర్జిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : నిత్యం సమస్యలతో సతమతమవుతున్నామని, వాటిని పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అర్జిదారులు వేడుకున్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మొత్తం 43 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీవో మంగిలాల్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు డబ్బాతో వృద్ధురాలు

రేగొండ మండల కేంద్రానికి చెందిన గడ్డం రాధమ్మ అనే వృద్ధురాలు ఎన్ని సార్లు తిరిగినా సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజావాణికి పురుగు మందు డబ్బాతో వచ్చారు. రేగొండలో 1976 సంవత్సరంలో ఎకరానికి రూ.500 చొప్పున 2.30 ఎకరాలను కొనుగోలు చేశానని.. కొంత మంది వ్యక్తులు భూమిని కబ్జా చేసి పెట్రోల్ బంకు నిర్మించారన్నారు. కలెక్టర్ వృద్ధురాలితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో వెళ్లిపోయింది

సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

- గుర్రంపేట గ్రామస్థులు



నిత్యం సింగరేణి ఓసీ-3 పేలుడుతో దినదిన గండంగా బతుకుతున్నాం.. ఓసీ-3 సమీపంలోనే గుర్రంపేట ఎస్సీ కాలనీ ఉండటంతో పేలుడు ధాటికి ఇళ్లు దెబ్బతిని ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి.. పేలుడు వల్ల వచ్చే పొగ, దుర్వాసనతో అనారోగ్యానికి గురవుతున్నాం. అధికారులు వచ్చి మా పరిస్థితి పరిశీలించి రోజులు గడుస్తున్నా న్యాయం జరగడం లేదు.

ఉపాధి అవకాశం కల్పించండి

- కె.మంజుల, పాపయ్యపల్లి, చెల్పూర్



దివ్యాంగురాలినైన తనకు ఉపాధి అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను వేడుకున్నాను. బయట కూలి పనికి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. ఇంటర్ వరకు చదువుకున్న నాకు అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు లేదా ఏదైనా చిరు ఉద్యోగ అవకాశం కల్పిస్తే ఎవరిపై ఆధారపడకుండా జీవిస్తా..

భూమి పట్టా చేసుకున్నారు..

- మెరుగు ఆగయ్య, కాపురం, మల్హర్‌రావు మండలం



నా పట్టా భూమిని మా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తప్పుడు సాక్ష్యాలతో అధికారులతో కలిసి అక్రమంగా పట్టా చేసుకున్నాడు. ఈ విషయమై కోర్టుకు వెళ్లగా తీర్పువచ్చే వరకు భూమిపైకి ఎవరూ వెళ్లకూడదని ఆదేశాలు వచ్చాయి. అయినా సదరు వ్యక్తి నాకు చెందిన పంట భూమిలో సాగు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. జిల్లా కలెక్టర్ స్పందించి నా భూమిని నాకు ఇప్పించాలని వేడుకున్నాను.

అధికలోడు రవాణాపై చర్యలకు ఆదేశం


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

ఈనాడు కథనానికి స్పందన

భూపాలపల్లి కలెక్టరేట్, కాటారం, న్యూస్‌టుడే : పరిమితికి మించి ఇసుక రవాణా చేసే వాహనాలను నియంత్రించడానికి కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం 'ఈనాడు'లో 'ప్రాణాలు హరిస్తున్న లారీలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ రెవెన్యూ, పోలీస్, టీజీ ఎండీసీ, మైనింగ్, రవాణా, నీటిపారుదల, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, భూగర్భజల తదితర శాఖల అధికారులతో జిల్లాస్థాయి సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిమితికి మించి ఇసుక రవాణా చేయడంతో రహదారులు దెబ్బతినడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రమాదాల నియంత్రణకు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, అలాంటి వాహనాలకు జరిమానా విధించాలని అన్నారు. గతంలో ఇసుక తీయడానికి అనుమతిచ్చిన అన్నారం, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో వర్షాలు, వరదలతో అనుకున్న మేరకు ఇసుక తీయలేకపోయారని.. తిరిగి అనుమతిచ్చేందుకు టీజీ ఎంఐడీసీ ఎండీకి సిఫారసు చేయాలన్నారు. అధిక ఇసుక లోడుతో వెళ్తున్న వాహనాల నుంచి ఇసుకను తహసీల్దార్ల పర్యవేక్షణలో దిగుమతి చేసి ఇసుకను ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మైనింగ్ ఏడీ జయరాజ్, టీజీఎండీసీ పీవో శ్రీరాములు, డీపీవో నారాయణరావు, రవాణా శాఖ అధికారి సంధాని, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.




వివరాలు 6లో...

సొంతింటి కల నెరవేరేనా?

న్యూస్‌టుడే, చిట్యాల

నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పథకాన్ని తీసుకొచ్చింది. మండలాల్లోని పలు గ్రామాలను ఎంపికచేసి ఇళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. కొన్నిచోట్ల లబ్ధిదారుల కమిటీతో, మరికొన్ని చోట్ల గుత్తేదారుల ద్వారా ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి పేదలకు అప్పగించాలని పనులు ప్రారంభించారు. నిధుల లేమితో పాటు వివిధ కారణాలతో అసంపూర్తిగా మిగిలిపోయాయి. కొన్ని గ్రామాల్లో పనులను ప్రారంభించలేదు. మరికొన్ని గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు పడక గదుల ఇళ్ల పథకం స్థానంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం గ్రామాల వారీగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తోంది. కాగా, గతంలో రెండు పడక గదుల ఇల్లు మంజూరైన లబ్ధిదారులు ఆందోళనగా ఉన్నారు. తమకు కేటాయించిన ఇల్లు పూర్తికాకపోవడంతో గృహ ప్రవేశం చేయలేదని చెబుతున్నారు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తగిన నిధులు మంజూరు చేస్తే.. ఇల్లు పూర్తవుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పిల్లర్లకే పరిమితం



ఈ చిత్రంలో కనిపిస్తున్నది చిట్యాల మండలం వెంచరామి శివారు కుర్మపల్లి గ్రామంలో అసంపూర్తిగా మిగిలిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు.. పనులు కేవలం పిల్లర్లకే పరిమితమయ్యాయి. మండల కేంద్రానికి 75, వెంచరామికి 30, గోపాలపురానికి 65, చల్లగరిగెకు 100, జూకల్‌కు 75, అందుకుతండాకు 20, షైన్‌పాకకు 20, ఒంటిప్పతండాకు 10, జడల్‌పేటకు 06, కుమ్మరిపల్లి గ్రామాల్లో 20 ఇళ్లను గత ప్రభుత్వం మంజూరు చేసింది. నిర్మాణ పనులకు రూ.21.21 కోట్లను కేటాయించగా కేవలం రూ. 4.82 కోట్లను ఖర్చు చేశారు. చిట్యాల, అందుకుతండా, ఒంటిప్పతండా గ్రామాల్లో నిర్మాణ పనులను ప్రారంభించలేదు.

స్లాబ్ లెవల్ వరకే..



టేకుమట్ల మండలం ద్వారకపేట గ్రామంలో అసంపూర్తి నిర్మాణాలివీ.. పనులను 2018లో ప్రారంభించారు. గ్రామానికి 30 ఇళ్లను మంజూరు చేసిన ప్రభుత్వం రూ.1.51 కోట్లను కేటాయించింది. స్లాబ్ లెవల్ వరకు పనులు పూర్తికాగా గోడల నిర్మాణం, ఇతర పనులు అసంపూర్తిగా మిగిలాయి. నిధుల కొరతతో పనులు ఆగినట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. –టేకుమట్ల

లబ్ధిదారులే నిధులు సమకూర్చొకొని..



మొగుళ్లపల్లి మండలంలో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలాయి. మండలంలోని ముల్కలపల్లికి 40, మేదరమెట్లకు 50, వేములపల్లి గ్రామానికి 50 ఇళ్లు కేటాయించారు. 2018లో పనులు ప్రారంభించినా, ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. ముల్కలపల్లిలో లబ్ధిదారులే సొంతంగా నిధులు సమకూర్చుకొని తాత్కాలికంగా ఉండేందుకు వీలుగా పనులు చేసుకున్నారు. ప్రభుత్వ నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు నిధులు కేటాయించాలని కోరుతున్నారు. –మొగుళ్లపల్లి

అర్ధంతరమే..



కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడెపాక, రేగొండ మండలం రామన్నగూడెం గ్రామంలో గత ప్రభుత్వం చేపట్టిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. చిన్నకోడెపాకలో 50 ఇళ్లు మంజూరు కాగా, స్లాబ్ లెవల్ వరకు పనులు పూర్తయ్యాయి. 38 ఇళ్ల గోడల నిర్మాణం పూర్తిచేశారు. మిగతా పనులకు నిధులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. రామన్నగూడెంలో 35 ఇళ్లు మంజూరు కాగా 12 ఇళ్ల పనులు పూర్తయ్యాయి. మిగతావి ఆగిపోయాయి. – రేగొండ

పేదలందరికీ న్యాయం చేస్తాం.. : - గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్యే

నియోజకవర్గంలోని అర్హులైన పేదలకు ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశాం.. రెండు పడక గదుల ఇళ్ల విషయంపైనా నిర్ణయం తీసుకుంటాం..

కరెంటు తీగలకు.. గిజిగాడి గూళ్లు



విద్యుత్తు తీగలకు గిజిగాడు గూళ్లు కనువిందు చేస్తున్నాయి. మండలంలోని పర్లపల్లి శివారులో పెద్దకోమటిపల్లి గ్రామానికి వెళ్లేదారిలోని ఓ వ్యవసాయ క్షేత్రం వద్ద ఈ దృశ్యం కనిపించింది. సాధారణంగా గిజిగాడు చెరువులు, బావుల అంచుల్లో, చెట్లకు గూడు కట్టుకోవడం చూస్తుంటాం.. ఇక్కడ అందుకు భిన్నంగా విద్యుత్తు తీగలకు గూడు కట్టుకోవడంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.

– న్యూస్‌టుడే, మొగుళ్లపల్లి(భూపాలపల్లి జిల్లా)

ఈ సన్నరకాలకే.. రూ.500 బోనస్
వివరాలు 6లో..

ఆశా కార్యకర్తల దినచర్య పుస్తకావిష్కరణ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆశా కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆశా కార్యకర్తల దినచర్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఆశా కార్యకర్త దినచర్య పుస్తకంలో ఎలాంటి తప్పులకు తావు లేకుండా సమగ్ర సమాచారం నమోదు చేయాలన్నారు. వైద్యాధికారులు రోజువారీ తనిఖీలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్, ఆర్డీవో మంగిలాల్ పాల్గొన్నారు.

● యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా అడ్వాన్స్డ్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని.. అందులో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కేంద్రంలో 6 కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని.. వాటిలో 172 సీట్లు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని చెప్పారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వం..!

● త్వరలోనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
● జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్



ముఖాముఖి

న్యూస్‌టుడే, భూపాలపల్లి కలెక్టరేట్

'రేయనకా.. పగలనకా పంట పండించిన అన్నదాతలు దళారులకు విక్రయించి మోసపోకుండా ప్రభుత్వమే గిట్టుబాటు ధరను కల్పించి కొనుగోలు చేస్తుంది.. ఈ మేరకు త్వరలోనే జిల్లా వ్యాప్తంగా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని' జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్ అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ప్రభుత్వ నిబంధనలు, అన్నదాతలు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో మాట్లాడారు.

న్యూస్‌టుడే : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేయనున్నారు..? ఎంత మేర ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నారు..?

డీఎస్‌వో : గతంలో జిల్లా వ్యాప్తంగా 189 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. త్వరలోనే మళ్లీ అవే కేంద్రాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.. 2.01 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అంచనా వేశాం. అందుకనుగుణంగా ప్రణాళిక తయారు చేస్తున్నాం.

? సన్న ధాన్యం కొనుగోలుకు ఏవైనా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారా..? సన్నధాన్యం పరిశీలనకు ఎలాంటి పద్ధతులు అవలంబించనున్నారు..?

✔ జిల్లాలో 2.01 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశాం. 1.41 లక్షల మెట్రిక్ టన్నులు సన్న ధాన్యం, 60 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం వస్తుందనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నాం. ఒకే కొనుగోలు కేంద్రంలో సన్నధాన్యాలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు సన్నధాన్యం గింజ పొడవు, వెడల్పు, నిష్పత్తి ఇలా పలు రకాల పరిశీలన చేయనున్నాం. అలాగే సన్న ధాన్యం నింపే గోనె సంచులను రివర్స్ తీసి అందులో ధాన్యం నింపడంతో పాటు ఎరుపు రంగు దారంతో సంచులను కుట్టి బస్తాలపై ఎస్ అనే అక్షరం, కేంద్రం కోడ్ ఎరుపు రంగుతో రాయాలని ఆదేశాలు ఉన్నాయి. ఇలాంటి నిబంధనలు పక్కాగా పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం.

? గతంలో ధాన్యం నగదు జమకాకపోవడంతో రోజుల తరబడి ఎదురుచూసిన సందర్భాలు అనేకం.. ఇప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు..?

✔ గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300 ప్రభుత్వం ధర నిర్ణయించింది. గ్రేడ్ ఏ రకంలో ప్రభుత్వ నిబంధనల మేరకు సన్నధాన్యం ఉంటే వాటికి అదనంగా రూ.500 జమ చేసే అవకాశం ఉంటుంది. అలాగే ధాన్యం విక్రయించిన రైతులు తప్పకుండా రసీదు పొందాలి. అన్నదాతలకు 48 గంటల్లో నగదు జమచేసేలా చర్యలు తీసుకుంటాం.

? ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

✔ ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా జిల్లా సరిహద్దు ప్రాంతంలో తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ధాన్యం కొనుగోలు పూర్తయ్యేంత వరకు తనిఖీ కేంద్రాన్ని నిర్వహిస్తాం. జిల్లా సరిహద్దు మహారాష్ట్ర నుంచి ధాన్యం రాకుండా కాళేశ్వరంలో తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ఇందులో పోలీస్, రెవెన్యూ అధికారులు ఉంటారు. నిత్యం తనిఖీలు చేసి ధాన్యం రాకుండా పర్యవేక్షిస్తారు.

? రైతులకు మీరిచ్చే సలహా ఏంటి?

✔ ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యాన్ని ఆరబెట్టి, చెత్త, తాలు, మట్టి రాళ్లు లేకుండా ధాన్యాన్ని శుభ్రపర్చుకోవాలి.

అన్నదాతలు వారి ఆధార్, బ్యాంకు పాస్‌బుక్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ ప్రతులను అందించాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు ధాన్యం అందించే అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

విరులు.. లాభాల సిరులు



నర్సంపేట, ఎల్కతుర్తి, న్యూస్‌టుడే : బంతి పూల సాగు లాభదాయకంగా ఉండటంతో పలువురు రైతులు ఈ సాగుపై మక్కువ చూపుతున్నారు.. స్వల్ప పెట్టుబడి.. తెగుళ్లు, చీడపీడల బాధలు తక్కువే.. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం రాజపల్లిలో ఎడ రమేశ్ ఎకరం భూమిలో, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపూర్‌లో రైతు అంబాల కరుణాకర్ ఎకరంలో బంతి సాగు చేశారు. దసరా, దీపావళి పండగల నేపథ్యంలో మార్కెట్‌లో ఆశించిన ధర పలుకుతోంది. రమేశ్ తన మిత్రుడి సాయంతో గత జులైలో ఈస్ట్‌వెస్ట్ కంపెనీకి చెందిన బంతి విత్తనాన్ని బెంగళూరు నుంచి తెప్పించి నారు పోసినట్లు తెలిపారు. నారు పోసిన 25 రోజుల తర్వాత మొక్కలు నాటారు. అంతరకృషి, మొక్కలకు ఎరువులు వేశారు. 52 రోజులకు రెక్కల పురుగు నివారణకు పురుగు పిచికారీ చేశారు. పూలు మొత్తం నాలుగు కోతలు వస్తాయి. మొదటి కోత తొలి బతుకమ్మ(అమావాస్య)కు కోయగా దిగుబడి టన్నున్నర వచ్చింది. కిలో రూ.80 ధర పలికింది. సద్దుల బతుకమ్మకు రెండో కోత మూడు టన్నుల దిగుబడి రాగా, ధర రూ.60-70 వరకు ధర పలికింది. ఈ రెండు విడతలో దాదాపు రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చిందని రైతు రమేశ్ వివరించారు.

ఆదర్శం



తోటలో పనులు చేస్తున్న రమేశ్ దంపతులు

రూ.2.5 లక్షలు వస్తాయని అంచనా..
-అంబాల కరుణాకర్, రైతు



రెండేళ్ల నుంచి బంతి సాగు చేస్తున్నాను. సుమారు రూ.3 లక్షల ఆదాయం వస్తుందని అంచనా.. పెట్టుబడి రూ.50వేలు పోగా రూ.2.5 లక్షలు చేతికి వస్తాయి..

ప్రశ్న- సమాధానం

? పత్తి పంటలో ఆకులు నల్లగా మారుతున్నాయి. ఎండి పోయి రాలుతున్నాయి. నివారణ చర్యలు తెలపండి..? -రైతు, రావుల లక్ష్మయ్య, సూధన్‌పల్లి.

✔ బ్యాక్టీరియాతో ఆకులు నల్లగా మారుతున్నాయి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ రెండు గ్రాముల మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పంట ఎదుగుదలకు ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను నేల ద్వారా మొక్కలకు అందించాలి. పైపాటుగా లీటరు నీటికి 10 గ్రాముల యూరియా స్థూల పోషకాల మిశ్రమాన్ని వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
-డా.రాజు, శాస్త్రవేత్త, కేవీకే వరంగల్
-వరంగల్ వ్యవసాయం



రైతేరాజు

ఈ సన్నరకాలకే.. రూ.500 బోనస్!



పాకాల ఆయకట్టులో సాగవుతున్న సన్నవరి

ఖానాపురం, గోపాలపూర్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వరి పండించే రైతులకు క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.. అయితే, ఏయే రకాలకు బోనస్ ఇస్తారో తెలియక అన్నదాతలు అయోమయంలో ఉన్నారు. ఇటీవల ఆయా రకాల జాబితాను వ్యవసాయ శాఖకు ప్రభుత్వం విడుదల చేసింది. 33 రకాల సన్నాల వరికి బోనస్ ఇవ్వనున్నట్లు ప్రకటించారని వ్యవసాయాధికారి భోగ శ్రీనివాస్ 'రైతేరాజు'కు తెలిపారు. సిద్ధి(డబ్ల్యూజీఎల్44), కేపీఎస్ 2874(కంపాసాగర్ వరి-1), సాంబమశూరి, జగిత్యాల వరి-3, జగిత్యాల వరి-2, వరంగల్ సాంబ(వరంగల్ 14), వరంగల్ సన్నాలు, జగిత్యాల మసూరి, పొలాస ప్రభ(జేజీఎల్384), క్రిష్ణ(ఆర్ఎన్నార్2458), మానేరు సోన, తెలంగాణ సోన(ఆర్ఎన్నార్ 15048), వరంగల్ వరి-1119, కూనారం వరి-2, వరంగల్ వరి-2, రాజేంద్రనగర్ వరి-4, కూనారం వరి-1, జగిత్యాల సన్నాలు, జగిత్యాల సాంబ, అంజన(జేజీఎల్ 1118), నెల్లూరు మసూరి, ప్రద్యుమ్న సుగంధ సాంబ, శోబిని, సోమనాథ్, ఆర్ఎన్నార్, కేపీఎస్ 6261, జేసీఎల్ 33124, హెచ్ఎంటీ సోన, మారుతేరు సాంబ, మార్టేరు మసూరి, ఎంటీయూ 1271 రకాలు జాబితాలో ఉన్నాయి. వీటితో పాటు సన్నాలుగా ఉండి 6 మి.మీ పొడవు, వెడల్పు 2 మిల్లీమీటర్ల కన్నా తక్కువగా ఉన్న పరిమాణాన్ని పరిగణలోకి తీసుకొని సన్నరకంగా గుర్తించి బోనస్ చెల్లిస్తారు. ధాన్యం కొనుగోలు సందర్భంగా వ్యవసాయాధికారులు వెర్నియర్‌కాలిపర్స్‌తో సూక్ష్మ కొలతలు గణించి ప్రతి వడ్ల కుప్పను పరిశీలించి నిర్ధారణ చేయనున్నట్లు పేర్కొన్నారు. కాగా రైతు పండించిన పంట మొత్తాలకు బోనస్ ఇస్తారా..? రైతు భరోసాకు ఇచ్చే కటాఫ్ ఎకరాలకు ఇస్తారో ఇంకా నిర్ణయించలేదు.

-న్యూస్‌టుడే
వరంగల్ వ్యవసాయం

రైతుకు భరోసా.. మాన్‌ధన్ యోజన



కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన ద్వారా వయసు పై బడిన రైతులకు సామాజిక భద్రత కల్పిస్తోంది. గరిష్ఠంగా రెండు హెక్టార్లు(5 ఎకరాలు)లోపు సాగు భూమి ఉండి 18-40 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులు.. అధికారులు, ఉద్యోగులు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజినీర్లు ఇతర వృత్తి నిపుణులు దీనికి అనర్హులు.. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నవారు, నిర్దేశించిన దాని కంటే అధిక రాబడి పొందుతున్నవారు, ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందినవారు కూడా పథకంలో చేరడానికి వీల్లేదు.. రైతులు కామన్ సర్వీసు కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలి. ఫొటో, నివాస, ఆదాయ, ధ్రువీకరణ, వయసు నిర్ధారణ, సాగు భూమి పత్రాలు, ఆధార్ కార్డు సమర్పించాలి. పీఎంకేఎం పోర్టల్‌లో నమోదు చేశాక చరవాణి నంబరుకు సందేశం వస్తుంది. ప్రత్యేకంగా పింఛను ఖాతా తెరిచి కార్డు ఇస్తారు. ఇందుకైన ఖర్చు రూ.30లను ప్రభుత్వమే చెల్లిస్తుంది.

వయసు ఆధారంగా ప్రీమియం : పథకంలో చేరిన రైతులు వయసును బట్టి ప్రీమియం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వారు తన వాటాగా రూ.55 చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం రూ.55 కలిపి బీమా కంపెనీకి రూ.110 చెల్లిస్తుంది. ఏటా వయసును బట్టి ప్రీమియం రూ. 3 నుంచి రూ.10 వరకు పెరుగుతుంది. 40 ఏళ్లకు పైబడిన వారు రూ.200 చెల్లించాలి. ఇంతే మొత్తం ప్రభుత్వమూ చెల్లిస్తుంది. 60 ఏళ్లు వచ్చే వరకు ప్రీమియం కట్టాలి. ఆ తర్వాత ప్రతి నెలా రూ.3 వేల చొప్పున పింఛను వస్తుంది. ఒకేసారి డబ్బులు కావాలనుకుంటే రైతు కట్టిన, సర్కారు చెల్లించిన మొత్తంలో సగం ఒకేసారి అందజేస్తారు.

నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లిస్తేనే.. -కె.దామోదర్‌రెడ్డి, ఏడీఏ, నర్సంపేట

లబ్ధిదారు మరణిస్తే జీవిత భాగస్వామికి సగం పింఛను రూ.1500 ఇస్తారు. పథకాన్ని కొనసాగించేందుకు కనీసం అయిదేళ్లపాటు రైతు వాటా నెలవారీ కిస్తీలను నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లించాలి.

షట్లర్ శ్రీచేతన్‌శౌర్యకు రెండో ర్యాంకు



వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా సబ్ జూనియర్(అండర్-13) బ్యాడ్మింటన్ ర్యాంకింగ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడాకారుడు శ్రీచేతన్‌శౌర్య తన స్థానాన్ని మెరుగుపర్చుకున్నాడు. బాలుర డబుల్స్ విభాగంలో 2వ స్థానంలో, సింగిల్స్‌లో 4వ స్థానంలో నిలిచాడు. ఇటీవల జరిగిన పలు జాతీయస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించి.. వ్యక్తిగత ర్యాంకింగ్‌లో ముందుకొచ్చాడు. హనుమకొండలోని పెద్దమ్మగడ్డకు చెందిన శ్రీచేతన్‌శౌర్య ఆటతీరు అభినందనీయమని వరంగల్ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి రమేశ్‌రెడ్డి, సంఘం ప్రతినిధులు డా. రమేశ్‌కుమార్, నాగ కిషన్ పేర్కొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

వరంగల్ క్రీడావిభాగం: వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహణ ప్రతినిధి కన్నా తెలిపారు. హనుమకొండలోని తితితే వేడుకల మందిరంలో అండర్-15 విభాగంలో బాలబాలికలకు పోటీలు ఉంటాయన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై పోటీలను ప్రారంభిస్తారన్నారు. తొలి నాలుగు స్థానాల్లో నిలిచే బాలబాలికలు తమిళనాడులో జరిగే జాతీయస్థాయిలో పాల్గొంటారని చెప్పారు.

అమ్మ కోసం.. సాంకేతిక బాట

యాప్‌పై శిక్షణకు శ్రీకారం

ఇంట్లో కూతురు/ కోడలు గర్భం దాల్చితే వారి బాగోగులను పెద్దవాళ్లు చూసుకుంటారు. ఇప్పుడిక ట్రెండ్ మారుతోంది. రానున్న రోజుల్లో ఆధునిక చేదోడు కానుంది. సాంకేతిక బాట పట్టిన గర్భ సంరక్షణ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. నేషనల్ హెల్త్ మిషన్, యునిసెఫ్ భాగస్వామ్యంతో అర్మన్ అనే స్వచ్ఛంద సంస్థ రూపకల్పన చేసిన 'అమ్మ కోసం' యాప్ ప్రయోజనకరంగా మారనుంది. ఇది గర్భిణులు, బాలింతలు, పిల్లల శ్రేయస్సుకు దోహదపడుతుంది.

అమ్మ కోసం యాప్‌ను అమలు చేయడానికి ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఆరు జిల్లాల పరిధిలోని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఇటీవల ప్రారంభించారు.
-న్యూస్‌టుడే, డోర్నకల్

ఆరోగ్య కల సాకారం

అరచేతిలో స్మార్ట్‌ఫోన్ ఇమిడి ఉంది. ప్రసవించిన జీవితంలో ఒకటిగా మారింది. ఇప్పుడు 'అమ్మ-కోసం' యాప్ పురుడు పోసుకోవడంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఆరోగ్య సంబంధ అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చే ప్రధాన వనరుగా మారింది. గర్భధారణ సమయంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడం ఎలా? పిండం ఎదుగుదలను పర్యవేక్షించడం ఎలా.. తదితర అంశాలను తెలుసుకునే వీలుంది. లోపాలుంటే వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.

డౌన్‌లోడ్ ఇలా..

గూగుల్ ప్లేస్టోర్‌లో అమ్మ-కోసం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అవసరమైన అనుమతులు అంగీకరించాక లాగిన్ ప్రక్రియ కొనసాగించాలి.
☛ యూజర్ నేమ్, పాస్‌వర్డు నమోదు చేసి 'రిమెంబర్ మీ' చెక్‌బాక్స్ మీద నొక్కాలి.
☛ తెరపై ఐహెచ్‌ఏటీఓఎం పేరిట 'చాట్‌బోట్' కనిపిస్తుంది.
☛ బ్యాక్ గ్రౌండ్‌లో చూపిన విధంగా ఆఫ్‌లైన్‌లో ఉపయోగించుకునేందుకు అన్ని కోర్సులను ఫైళ్లని సైతం డౌన్‌లోడ్ చేస్తుంది. ఒకవేళ ఆటోమెటిక్‌గా డౌన్‌లోడ్ కాని పక్షంలో 'సింక్ బటన్'పై క్లిక్ చేస్తే డౌన్‌లోడ్ అవుతుంది.

ఇవీ ప్రయోజనాలు..

☛ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఎల్‌ఎంఎస్) ద్వారా పీడీఎఫ్, వీడియో, ఆడియో, ఇమేజ్ వివిధ ఫార్మాట్లలో కోర్సు పాఠాలు వీక్షణకు ఇది వీలు కల్పిస్తుంది.
☛ కోర్సు లెసన్ ఫైళ్లలోకి వెళితే.. ప్రస్తుతం పుట్టబోయే ఉన్న వాటితో పాటు ప్రారంభించిన కోర్సుల జాబితా కనిపిస్తుంది. చిట్కాలు అందుబాటులో ఉంటాయి.
☛ ప్రసవానికి ముందు, తర్వాత చేయాల్సిన వ్యాయామాలను ఇది సూచిస్తుంది
☛ మంచి పోషకాల ఆహారాన్ని తీసుకోవడంలో తోడుంటుంది
☛ బాలింతలకు అవసరమైన సూచనలు చేస్తుంది
☛ పిల్లల విషయంలో జాగ్రత్తలను తెలుపుతుంది.

ఉమ్మడి జిల్లా స్వరూపం

జిల్లా	గర్భిణులు	బాలింతలు	పిల్లలు
మహబూబాబాద్	4930	3943	44837
జయశంకర్ భూపాలపల్లి	2653	2431	24476
హనుమకొండ	4231	3987	45552
వరంగల్	6128	6432	50423
జనగామ	3396	2430	23643
ములుగు	2874	2497	21624

గర్భిణులకు మేలు

- డా.మధుసూదన్, జిల్లా వైద్యాధికారి, శ్రీదేవి, జిల్లా ప్రోగ్రాం అధికారి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

అమ్మ-కోసం యాప్ గర్భిణులకు ఒక కల్పతరువు. హైరిస్క్ గర్భిణులు తీసుకోవాల్సిన చర్యలపై ఏఎన్ఎంలకు అవగాహన కల్పిస్తున్నాం. వీటిలో గర్భస్థ సమయంలో కాల్షి, రక్తహీనత, అధిక రక్తపోటు, ప్రసవ పూర్వ రక్తస్రావం, మధుమేహం, గత సిజేరియన్ స్థితి, పిండం ఎదుగుదల ముఖ్యమైనవి. యాప్‌ను ఏఎన్ఎంల ట్యాబ్‌లలో డౌన్‌లోడ్ చేశారు. పదిహేను రోజులకు ఒకసారి ఒక్కో అంశంపై వీరికి ఒక లింక్‌ను ఆడియో/ వీడియో రూపంలో పంపిస్తారు.

తెలుగులో సులభంగా అర్థం అవుతుంది

- సీహెచ్ స్వప్న, ఏఎన్ఎం, భూపాలపల్లి



అమ్మ కోసం యాప్ తెలుగులో ఉండటంతో సులభంగా అర్థమవుతోంది. శిక్షణలో గర్భిణులు, వారు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, చికిత్సకి సంబంధించిన అంశాలను వివరించారు.



భూపాలపల్లిలో శిక్షణకు హాజరైన ఏఎన్ఎంలు

'కల్వకుంట్ల కుటుంబం ఆస్తుల వివరాలు ప్రకటించాలి'

జనగామ, న్యూస్‌టుడే: 'కల్వకుంట్ల కుటుంబానికి నిజాయతీ ఉంటే, 2014లో మీ ఆస్తులు ఎన్ని, ఇప్పుడెన్ని? అనే వివరాలను ప్రకటించాలి' అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, కవిత, సంతోష్, హరీశ్‌రావు పలు అధికార కూటమిగా మారి దోపిడీ చేశారని ఆరోపించారు. జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా విపణిలో సోమవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఎంపీ కడియం కావ్య, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్న సభలో శ్రీహరి మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో కమిషన్ల కోసం పనులు తప్ప, అభివృద్ధి జరగలేదని, అందుకే ప్రస్తుతం సమస్యలు పేరుకున్నాయని విమర్శించారు. తాను రాజకీయాల్లో ఉన్నప్పుడు విద్య, ఉపాధిపై సమీక్ష గంట సమయం ఇవ్వలేదని, ప్రజా సమస్యలపై మాట్లాడితే తనను పక్కన పెట్టారని ఆరోపించారు. డీఎస్సీ ప్రక్రియను ఆరు మాసాల్లో విజయవంతంగా పూర్తి చేసి 11 వేల కుటుంబాల్లో దీపం వెలుగులు నింపారన్నారు. భాజపా నాయకత్వం అధిష్ఠానం కోసం కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రఘునందన్‌రావు, ఈటల పోటీపడుతున్నారన్నారు. మూసీ, హైడ్రా విషయంలో వారి మాటల్లో పొంతనలేదని, ఒక్కసారైనా కలిసి ఈ అంశాలపై స్పష్టతనివ్వాలని ప్రశ్నించారు. రూ.7 లక్షల కోట్ల అప్పులతో ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, హామీల అమలులను రాష్ట్ర ప్రభుత్వం గొప్ప సంకల్పం బలంతో ముందుకు వెళ్తోందని వివరించారు.

డమ్మీ తుపాకితో బెదిరించిన దుండగుడికి దేహశుద్ధి



నిందితుడు

దామెర, న్యూస్‌టుడే: డబ్బులివ్వాలని డమ్మీ తుపాకితో కిరాణ దుకాణం యజమానిని బెదిరించిన వ్యక్తికి గ్రామస్థులు దేహశుద్ధి చేసిన సంఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు కందికొండ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఊరుగొండకు చెందిన సంపత్ జాతీయరహదారి పక్కన కిరాణ దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి దుకాణం షట్టర్‌ను తట్టి బిస్కెట్ ప్యాకెట్ కావాలని కోరాడు. దీంతో సంపత్ షట్టర్ తెరవగానే.. దుండగుడు డమ్మీ తుపాకి చూపించి డబ్బులివ్వకపోతే చంపేస్తానని బెదిరించాడు. తన వద్ద డబ్బులు లేవంటూ సంపత్ భయంతో కేకలు వేశారు. స్థానికులు వచ్చి ఆ వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సంపత్ తెలిపారు. దుండగుడు గతంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిసింది. నిందితుడిని విచారిస్తున్నట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.

పాఠశాలలో సార్వత్రిక ప్రవేశాలు షురూ!

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఖిలావరంగల్ మధ్యకోట ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో ప్రవేశాలు ప్రారంభమైనట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ మూరాల శంకరరావు తెలిపారు. సోమవారం ప్రవేశాల ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించారు. ఇతర వివరాలకు పాఠశాలల అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ శైలేంద్రకుమార్ 96034 86850 సంప్రదించాలన్నారు.

ప్రజాసేవలో పోలీసులు ముందుంటారు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజాసేవలో పోలీసులు ముందుంటారని అమరుల ఆశయ సాధనకు పనిచేస్తూ విధుల్లో రాణించాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. సోమవారం కమిషనరేట్‌లో అమరవీరుల స్తూపం వద్ద పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్‌డే) నిర్వహించారు. గతేడాది నుంచి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మృతి చెందిన 241 మంది పోలీసు అమరుల పేర్లను అదనపు డీసీపీ రవి చదివి వినిపించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య, కర్నల్ రవికుమార్, డీసీపీలు షేక్ సలీమా, రవీందర్‌తో పాటు ఏసీపీలు ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐ, పోలీసు అమరుల కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు సిబ్బంది అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. ఆర్ఐ స్పర్జన్ సారథ్యంలో సాయుధ పోలీసుల శోక్‌శ్రస్త చేసి మరణించిన పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ప్రజల సేవ కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసులు త్యాగధనులన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు పనిచేయాలన్నారు. నీతి నిజాయతీతో పనిచేస్తే గుర్తింపు ఉంటుందన్నారు. అమరవీరులు ఎల్లప్పుడూ మన గుండెల్లోనే ఉంటారన్నారు. వారి కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వారికి ఎలాంటి సమస్యలున్నా పోలీసు విభాగం తరపున సహకారం అందిస్తామన్నారు. అనంతరం కమిషరనేట్ నుంచి హనుమకొండ మిషన్ ఆసుపత్రి వరకు పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు కలిసి ప్రదర్శన నిర్వహించారు. పోలీసు జాగృతి కళా బృందం సభ్యులు పాల్గొని పోలీసు అమరులకు జోహార్లు అర్పించారు.



అమరవీరుల స్తూపం అలంకరణ



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా. చిత్రంలో పై వరుస(ఎడమ నుండి కుడికి) హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావిణ్య, సత్య శారద, ఎన్‌సీసీ కమాండెంట్ కర్నల్ రవీంద్ర కుమార్ రవి, డీసీపీలు షేక్ సలీమా, రవీందర్. కింది వరస పోలీసు ఉన్నతాధికారులు రవి, మధుసూదన్, నందిరాం నాయక్, సత్యనారాయణ, దేవేందర్ రెడ్డి



స్మృతి పరేడ్‌లో పోలీసుల నివాళి

నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటా

పాలకుర్తి, న్యూస్‌టుడే: జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం చేసి, మృతి చెందిన లకావత్ శ్రీను కుటుంబ సభ్యులను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ పరామర్శించారు. పాలకుర్తి మండలం మేకలతండాలోని శ్రీను నివాసాన్ని ఆయన సోమవారం సందర్శించి, విలేకరులతో మాట్లాడారు. శ్రీను మృతి ప్రభుత్వ హత్య అని అభివర్ణించారు. గిరిజన బిడ్డ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని వివరించారు. కాంగ్రెస్ నేత యాకాంతరావు ప్రమేయం ఈ ఘటనలో ఉందని తెలిసిందని, పోలీసులు ఉన్నా, అందరికీ శిక్ష పడేలా సీపీ, డీసీపీతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పారు. పోలీసులు విధుల పట్ల అంకితభావంతో పని చేయాలని, నాయకులకు ఒత్తాసు పలకడం సరికాదని అసహనం వ్యక్త చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, భాజపా జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామ్మోహన్‌రెడ్డి, తండావాసులు గాంధీ నాయక్, సురేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్, చిత్రంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, తదితరులు

గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

ఎనుమాముల మార్కెట్: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఎనుమాముల మార్కెట్ యార్డులో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి.. గరిష్ఠ ధరను పొందాలన్నారు. తేమ వల్ల రైతులు నష్టపోకుండా పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనంతరం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ తొలివిడతలో వరంగల్ జిల్లాలోని 14 కేంద్రాల్లో సోమవారం పత్తి కొనుగోళ్లు ప్రారంభించామని వరంగల్ కలెక్టర్ డా.సత్యశారద పేర్కొన్నారు. మిగతా చోట్ల త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సీసీఐ డిప్యూటీ మేనేజర్ అర్జున్ దవే, జేడీఎం శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంఓ సురేఖ, మార్కెట్ కార్యదర్శి నిర్మల, స్థానిక కార్పొరేటర్లు, అధికారులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ డా.సత్యశారద తదితరులు

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)
వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

ఉత్సాహం విరిసె.. ప్రతిభ మెరిసె!




వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి సమీపంలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం'అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాన్ని వెలిబుచ్చారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు ఎన్.సిరిచందన, జె.సింధూజ, కె.అనుమోల్‌కు పాఠశాల ప్రిన్సిపల్ జానీ ఆగస్టా, కరస్పాండెంట్ జోసెఫ్ బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న సెయింట్ పీటర్స్ హైస్కూల్ ప్రిన్సిపల్ జానీ ఆగస్టా, కరస్పాండెంట్ జోసెఫ్

దేవుడి మాన్యం.. ధరణిలో నిక్షిప్తం



రామన్నపేట(వరంగల్), న్యూస్‌టుడే

దేవుడి మాన్యాలు, ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ నడుం బిగించింది. ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు ఆధునిక, సాంకేతిక పద్ధతులు అవలంబిస్తోంది. గూగుల్ సహకారంతో దేవాలయాలు, భూములను జియో ట్యాగింగ్ చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 34,092 ఎకరాల భూములకు జియో ట్యాగింగ్ పూర్తయ్యింది. వీటిలో 57 శాతం ఆలయాల భూములను ధరణిలో నిక్షిప్తం చేశారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాను సారం వరంగల్ ఉమ్మడి జిల్లాలో దేవాలయాలు, భూముల జియో ట్యాగింగ్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది.



ములుగు జిల్లా మల్లూరు శ్రీలక్ష్మీనర్సింహస్వామి గుడి

☛ జయశంకర్ భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో దేవాదాయ శాఖ డివిజనల్ పరిశీలకులు, కార్యనిర్వహణ అధికారులు, ఉద్యోగులు రంగంలోకి దిగారు. ఇప్పటికే 1,062 వరకు ట్యాగింగ్ పూర్తయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలిస్తే ఈ ప్రక్రియలో ఉమ్మడి వరంగల్ జిల్లా ముందంజలో ఉంది.

☛ దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాలు, ధూపదీప నైవేద్యాల పథకం(డీడీఎన్) కింద ఎంపికైన దేవాలయాలు, వాటికి సంబంధించిన భూములు, ఆస్తులు, ధర్మ సత్రాలు ఇతర వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఫొటోలు తీసి గూగుల్ సహకారంతో జియో ట్యాగింగ్ చేస్తున్నారు.

☛ దేవస్థానం, దేవుడి, ఇతర విశిష్టత కలిగిన ఫొటోలు, ఆలయం పేరు, చిరునామా ఇతర వివరాలు క్షేత్రస్థాయి నుంచి అప్‌లోడ్ చేస్తున్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరాలయం

ఎలా అరికడతారంటే..!

దేవాలయాల భూములు, ఇతర ఆస్తులు జియో ట్యాగింగ్ చేయడం వల్ల ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుంది. స్థలం వివరాలు, సరిహద్దులు, దేవస్థానం పేరు, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. జియోట్యాగ్ చేసిన ఆలయాల భూములు, స్థలాల డేటాను రిజిస్ట్రేషన్ శాఖకు అనుసంధానం చేస్తారు. దీంతో అక్రమ రిజిస్ట్రేషన్లకు ఆస్కారం ఉండదు. జియో ట్యాగింగ్‌తో పాటు జియో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కొందరు నిపుణులు విజ్ఞప్తి చేస్తున్నారు.

త్వరలో పూర్తి చేస్తాం.

- రామల సునీత, ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్

ఉమ్మడి జిల్లాలోని దేవాలయాల భూములు, స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఇందులో భాగంగానే మొదటి దశలో జియో ట్యాగింగ్ చేసి, రెండో దశలో భూముల వివరాలన్నీ ధరణిలో నిక్షిప్తం చేస్తున్నాం. మిగిలినవి వారం నుంచి పది రోజుల్లో పూర్తి చేస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా

టేకుమట్ల: 96032 95502, భూపాలపల్లి: 94408 47097, భూపాలపల్లి రూరల్: 99592 57553 (10 AM TO 1 PM)

భూపాలపల్లి : పట్టణంలోని శాంతినగర్‌కాలనీ ప్రాంతంలో జంగేడు రోడ్డు పక్కన చెత్తచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దోమలు, పందుల బెడద ఎక్కువైంది. **- ప్రవీణ్, శాంతినగర్‌కాలనీ**


● పారిశుద్ధ్య కార్మికులను పంపించి రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. **- నవీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

రేగొండ : కొత్తపల్లి నుంచి కుమ్మరిపల్లి గ్రామాల మధ్య ఉన్న ఎస్సారెస్పీ కాల్వపై చిన్న వంతెన నిర్మించారు. వంతెన చిన్నగా ఉండటంతో కొత్తపల్లి నుంచి కుమ్మరిపల్లికి వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉంది. -భిక్షపతి, కొత్తపల్లి.

● రెండు గ్రామాల మధ్య ఉన్న ఎస్ఆర్ఎస్పీ కాల్వపై ఉన్న చిన్న వంతెనను పెద్దగా విస్తరించడానికి అవకాశం లేదు. అది కేవలం నడిచి వెళ్లడానికి వేసిన వంతెన మాత్రమే. -ఐబీ డీఈ గిరిధర్.

వీధి దీపాలు ఏర్పాటు

భూపాలపల్లి : పట్టణంలోని హైటెక్‌కాలనీ, తహసీల్దారు కార్యాలయం రోడ్డు ప్రాంతంలో రెండు రోజులుగా వీధి దీపాలు వెలగక పోవడంతో రాత్రిపూట చిన్నారులు, మహిళలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారని అదే కాలనీకి చెందిన మహిళలు కొందరు 'మేమున్నాం.. మీకు తోడుగా..'కు సమాచారం ఇచ్చారు. విషయాన్ని మున్సిపల్ ఛైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారు. విద్యుత్తు సరఫరా పర్యవేక్షించే సిబ్బందిని పంపించి, కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.



చెత్త తరలింపు

భూపాలపల్లి : పట్టణంలోని రాజీవ్‌నగర్‌కాలనీలో మురుగు కాల్వల పక్కనే చెత్తచెదారం పేరుకుపోయి ఉండటంతో దుర్వాసన వస్తోందని అదే కాలనీకి చెందిన కార్మికులు కొందరు 'మేమున్నాం.. మీకు తోడుగా..'కు సమాచారం ఇచ్చారు. విషయాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవీన్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్తను వాహనంలో డంపింగ్ యార్డుకు తరలించారు.

భగీరథ నీరంతా వృథా



చిట్యాల మండలం జడల్‌పేట శివారు భీష్మనగర్ గ్రామం మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ అవుతోంది.. మూడు రోజులుగా ఇలాగే కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, చిట్యాల (భూపాలపల్లి జిల్లా)

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే, కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి, న్యూస్‌టుడే : రక్తదానంతో ఆపదలో ఉన్న ఓ ప్రాణాన్ని కాపాడవచ్చని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కలెక్టర్ రాహుల్‌శర్మతో పాటు ఎస్పీ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో లేకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఆరోగ్యవంతులైన యువకులు ముందుకొచ్చి రక్తదానం చేయాలని చెప్పారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ఎస్పీ కిరణ్ ఖరే ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఓఎస్డీ బోనాల కిషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ ఉపాధ్యక్షులు కిరణ్, తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

చిట్యాల : రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వ్యక్తుల ప్రాణాలు నిలబెట్టవచ్చని సీఐ మల్లేశ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా భూపాలపల్లిలో జరిగిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న మండలానికి చెందిన యువకులను సోమవారం స్థానిక ఠాణాలో అభినందించారు. రక్తదానం చేసిన 14 మందికి ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

26న ధర్మయుద్ధ మహాసభ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి అంబాల చంద్రమౌళి

భూపాలపల్లి, న్యూస్‌టుడే : ఈ నెల 26న ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలోని నిర్వహించే మాదిగ ధర్మ యుద్ధ మహాసభకు జిల్లా నుంచి మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌ఛార్జి అంబాల చంద్రమౌళి కోరారు. సోమవారం భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా దేశంలోనే మొదటిసారిగా తానే వర్గీకరణ చేస్తానని.. అవసరమైతే గతంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌లకు ప్రత్యేకంగా ఆర్డినెన్స్ తీసుకొస్తానని.. ఇచ్చిన హామీల ప్రకారం మాదిగలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కమిటీలు, కమిషన్ల పేర్లతో కాలయాపన చేస్తూ. . మాదిగలను నమ్మించి మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ నెల 26న జరిగే మాదిగల ధర్మయుద్ధ మహాసభకు మంద కృష్ణమాదిగ హాజరవుతున్నారని, సభకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. నాయకులు నోముల శ్రీనివాస్, భిక్షపతి, సురేష్, తిరుపతి, సుమన్, అశోక్, రవి, వైకుంఠం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తైక్వాండోలో రాష్ట్రస్థాయికి ఎంపిక



ప్రజ్వల

చెల్పూర్, న్యూస్‌టుడే : గణపురం మండలం చెల్పూర్ కేటీపీపీ పాఠశాలకు చెందిన ప్రజ్వల రెడ్డి తైక్వాండో 47 కిలోల విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఆదివారం వరంగల్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన పోటీలకు విద్యార్థిని ఎంపికయ్యారు. డీఈవో రాజేందర్, ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేశ్, కోచ్ శ్రీకాంత్ విద్యార్థినిని అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



విష్ణు మహతు(పాతచిత్రం)

మహదేవపూర్, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన విష్ణు మహతు(20) అనే యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై కె.పవన్‌కుమార్ వెల్లడించారు. వివరాలు ఇలా.. ఝార్ఖండ్ రాష్ట్రం బొకారో జిల్లా అలోకడి గ్రామానికి చెందిన విష్ణు మహతు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో కొంత సొమ్ము నష్టపోయారు. మహదేవపూర్ మండలం ఎడపల్లికి వచ్చి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న జియలాజికల్ సర్వే విభాగంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 18న ఎడపల్లి గ్రామం నుంచి వెళ్లిపోయాడు. దీంతో అతడి సహచరులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గాలింపు చేపట్టగా మహదేవపూర్ శివారులో ఉరి వేసుకొని కనిపించాడు. అతడి సంబంధీకులు ధనేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జైలు

మహాముత్తారం, న్యూస్‌టుడే : మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జిల్లా కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు. మహాముత్తారం శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో మాదారం, పోలంపల్లి గ్రామాలకు చెందిన బొచ్చల సమ్మయ్య, ఎండీ.అలీమ్ మద్యం తాగి పట్టుబడినట్లు పేర్కొన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా సమ్మయ్యకు ఐదు రోజులు, అలీమ్‌కు రెండ్రోజుల జైలు శిక్ష ఇద్దరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. ఇద్దరిని పరకాల సబ్ జైలుకు తరలించామని, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

నిఘా నేత్రాలతో నేరాల నియంత్రణ

కాళేశ్వరం, న్యూస్‌టుడే : నిఘా నేత్రాల ఏర్పాటుతో నేరాల నియంత్రణతో పాటు అనుమానిత వ్యక్తులను సులువుగా గుర్తించే వీలు కలుగుతుందని మహదేపూర్ సీఐ రాంచందర్‌రావు అన్నారు. సోమవారం కాళేశ్వరం ఎస్సై చక్రపాణితో కలిసి అన్నారంలో పలు సీసీ కెమెరాలను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలు జరిగినప్పుడు, అనుమానిత వ్యక్తులు తిరిగినప్పుడు ఇతరత్రా నేరాలకు సంబంధించి నిఘా నేత్రాలు దోహదపడుతాయన్నారు. యువతకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి, న్యూస్‌టుడే : సమస్యల పరిష్కారం కోసం ఎంతో నమ్మకంతో వస్తున్న బాధితుల ఫిర్యాదులకు తగిన ప్రాధాన్యం కల్పిస్తూ, చట్టప్రకారం పరిష్కరించాలని ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దివస్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. పోలీసు అధికారులతో ఎస్పీ చరవాణిలో మాట్లాడి, బాధితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి 15 మంది బాధితులు ఎస్పీకి వినతిపత్రాలు అందజేశారు.

రైతు కుటుంబానికి రూ.8 లక్షల బీమా చెల్లింపు

వరంగల్ వ్యవసాయం : మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట గ్రామానికి చెందిన రైతు యార రాజిరెడ్డి కుటుంబానికి సోమవారం టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు రూ.8 లక్షల బీమా సొమ్ము అందించారు. రాజిరెడ్డి జిల్లా కర్షక మిత్ర పథకం కింద రుణాన్ని తీసుకున్నారు. ఇటీవల పంట పొలం వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఆయన మృతిచెందారు. రైతు పేరుమీద ఇఫ్కో- టోక్యో బీమా కంపెనీలో బీమా చేయించగా వచ్చిన బీమా మొత్తాన్ని ఆయన భార్య పద్మకు రవీందర్‌రావు అందించారు.

క్రీడా పోటీల్లో ప్రతిభ

భూపాలపల్లి, న్యూస్‌టుడే : ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా రెండు రోజుల క్రితం హనుమకొండలోని జేఎన్ఎస్ మైదానంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఖోఖో క్రీడా పోటీల్లో భూపాలపల్లి జిల్లా జట్టు రెండో స్థానం సాధించింది. అండర్ -14, అండర్-17 విభాగాల్లో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపించిన వారిని రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ క్రీడల కార్యదర్శి రమేష్ తెలిపారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

రేగొండ, న్యూస్‌టుడే : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఏ-1 పరీక్ష కేంద్రాలను జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగ కార్యదర్శి(డీసీఈబీ) ఒంటేరు చంద్రశేఖర్ పరిశీలించారు. రేగొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులు మానసిక ఇబ్బందులకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా ఉపాధ్యాయులు చూడాలని చెప్పారు. ఆయనతో ఎంఈవో ప్రభాకర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

సంక్షిప్తంగా

చిట్యాల, న్యూస్‌టుడే : రైతులకు కనీస మద్దతు ధర రూ.7,521 అందించి పత్తిని కొనుగోలు చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేశ్ డిమాండ్ చేశారు. సోమవారం చిట్యాల మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. చిట్యాల మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రైవేటు వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు మద్దతు ధరకు కాకుండా రూ.5 వేల నుంచి 7 వేల వరకు కొనుగోలు జరుపుతూ రైతుల జేబులు గుల్ల చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో జరుగుతున్న చిల్లర కాంటాలను పూర్తిగా అరికట్టి వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆనందం, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో సేవలందించాలి

మహదేవపూర్, న్యూస్‌టుడే : పాఠశాలలో కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి, పాఠశాలకు, విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని ప్రజాస్వామిక ఉపాధ్యాయ వేదిక నాయకులు పేర్కొన్నారు. మండలంలో కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి డి.శంకరయ్య, మండల అధ్యక్షులు మడక మధు, జిల్లా నాయకులు అయిత తిరుపతి, జోనల్ బాధ్యులు బి.తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

డీసీవోకు సన్మానం



కాటారం, న్యూస్‌టుడే : స్థానిక గిరిజన గురుకుల సంక్షేమ కళాశాల ప్రిన్సిపల్ బి.లాలును గురుకులాల సమన్వయ అధికారి(డీసీవో)గా నియమించారు. డీసీవోగా నియామకమైన ప్రిన్సిపల్‌ను గురుకుల బాలికల, బాలుర పాఠశాలల బోధన, బోధనేతర సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ రాజేందర్, మాధవి పాల్గొన్నారు.

'భారాస నాయకులు ధర్నా చేయడం సిగ్గుచేటు'

టేకుమట్ల, న్యూస్‌టుడే : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అందించడం లేదని భారాస నాయకులు ధర్నాలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో భారాస ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని చెప్పారు. అర్హులైన రైతులకు రైతు భరోసా అందించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి సర్వే చేయిస్తున్నారని, అందుకే కాలయాపన అవుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్, మండల ప్రధాన కార్యదర్శులు దాసారపు సదానందం, బండి రవీందర్, ఉపాధ్యక్షుడు మాదం కొంరయ్య, నాంపెల్లి వీరేశం, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండా శ్రీకాంత్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

కాటారం, న్యూస్‌టుడే : చిదినేపల్లి ప్రాథమిక పాఠశాల పాత భవనం కూల్చివేతపై సదరు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్మరణ్ ఫిర్యాదు చేశారు. నిబంధనలు పాటించకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా కూల్చివేశారని, చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



కాటారం, న్యూస్‌టుడే : మంథని నియోజకవర్గంలోని పలు మండలాల్లో నూతన రహదారులకు నిధుల మంజూరుపై మండల కాంగ్రెస్ శ్రేణులు మండల కేంద్రంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఫ్లెక్సీకి సోమవారం పాలాభిషేకం చేశారు. మంథని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్న మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు మహేశ్వరి, రాజశేఖర్, రాజు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాధ్యతల స్వీకరణ



భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఎస్సీ కార్పొరేషన్ నూతన కార్యనిర్వాహక అధికారి(ఈడీ)గా వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా చేపట్టే పథకాలను అర్హులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

దుకాణం డబ్బాల తొలగింపు..



టేకుమట్ల, న్యూస్‌టుడే : మండలంలోని టేకుమట్ల- సుబ్బక్కపల్లి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసుకున్న దుకాణాలను అధికారులు తొలగించారు. ఇటీవల మండలంలోని సుబ్బక్కపల్లి నుంచి అంకుషాపూర్ వరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయి. మండల కేంద్రానికి చేరుకోవడంతో పంచాయతీ ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసుకున్న పలు దుకాణాలను విస్తరణకు అడ్డంగా ఉండడంతో తొలగించాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. దుకాణం యజమానులు అక్కడి నుంచి ఖాళీ చేయకపోవడంతో సోమవారం అధికారులు పొక్లెయిన్ సాయంతో ట్రాక్టర్లలో తరలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో అనిత, సీఐ మల్లేశ్, ఎస్సై ప్రసాద్, ఎంపీవో సురేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి



కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : అర్హులైన ఉపాధ్యాయులందరూ బాధ్యతగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సునీత అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు, మొట్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి కుమారస్వామి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ సునీత ముఖ్య అతిథిగా హాజరై ఓటు హక్కు నమోదు చేసుకోవడంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియ నవంబర్ 6న ముగుస్తున్నందున ఆలోపు ప్రతి ఉపాధ్యాయుడు స్వచ్ఛందంగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మొగుళ్లపల్లి కాంప్లెక్స్ ఉపాధ్యాయుడు పింగిలి విజయపాల్‌రెడ్డి, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊపందుకున్న మిర్చి సాగు




మిర్చి సాగు ఊపందుకుంది. మల్హర్ మండలంలోని తాడిచెర్ల, మల్లారం, పెద్దతూండ్ల, చిన్నతూండ్ల, గాధంపల్లి, దుబ్బపేట తదితర గ్రామాల్లో విస్తారంగా సాగు చేస్తున్నారు. వండర్‌హాట్, 341, సింగిల్‌పట్టి విత్తనాలను రైతులు ఎన్నుకుంటున్నారు. ఏటా వాతావరణ పరిస్థితులు, తెగుళ్ల బెడద, పంట చేతికందే సమయంలో అకాల వర్షాలు అన్నదాతకు తీవ్ర నష్టం మిగుల్చుతున్నాయి. దీంతో ఏటా మిర్చి సాగు విస్తీర్ణం తగ్గుతోంది. ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు ఇలా పెట్టుబడులు భారమవుతున్నాయి. ఎకరాకు రూ.60 వేలకు పైగా పెట్టుబడులు ఖర్చువుతున్నాయి. ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్లు, నీటి తడుల తట్టుకునేందుకు రైతులు మల్చింగ్ సాగుపై ఆసక్తి చూపుతన్నారు. మల్హర్‌లో ఇప్పటివరకు 2,100 ఎకరాల్లో మిర్చి సాగైంది. **- న్యూస్‌టుడే, మల్హర్(భూపాలపల్లి జిల్లా)**

జిల్లా న్యాయమూర్తిని కలిసిన జీఎం



భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా ప్రధానకోర్టు న్యాయమూర్తి పి.నారాయణ బాబును సోమవారం భూపాలపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ సయ్యద్ హబీబ్ హుస్సేన్ మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఏరియాలోని బొగ్గు గనుల పరిస్థితి, సింగరేణి కార్మికులకు యాజమాన్యం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి జీఎం వివరించినట్లు తెలిసింది.

తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టండి



వెంకటేశ్వరపల్లిలో రైతు చేనులోని మిరప మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లిగోరి (రేగొండ), న్యూస్‌టుడే : మిరప పంటలకు వస్తున్న తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో వాసుదేవరెడ్డి అన్నారు. ఉద్యాన శాఖ అధికారులు సోమవారం వెంకటేశ్వపల్లి గ్రామంలోని మిరప చేన్లను పరిశీలించారు. వాతావరణంలో వస్తున్న మార్పులతో మిరప పంటలకు వడలు తెగుళ్లు, నులిపురుగుల బెడద మొక్కల్లో ఎక్కువగా కనిపిస్తోందని చెప్పారు. వెంటనే రైతులు వ్యవసాయశాఖ అధికారుల సాయంతో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సకాలంలో నివారణ చర్యలు చేపట్టకపోతే మొక్కలు, పంట చేను పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు సునీల్, సారయ్య రైతులు తదితరులు ఉన్నారు.

ఫైర్‌మెన్.. డీఎస్సీ విజేత



శ్రవణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఫైర్ స్టేషన్ అధికారులు, సిబ్బంది

భూపాలపల్లి : ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన భూపాలపల్లి అగ్నిమాపక కేంద్రంలో ఫైర్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న పన్నాల శ్రవణ్‌కుమార్‌ను సోమవారం జిల్లా అగ్నిమాపక అధికారి కేవీ.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సత్కరించారు. శ్రవణ్‌కుమార్ మహదేవపూర్ మండలం సురారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా నియామకమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌వో కుమారస్వామి, పలువురు ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్‌ల తనిఖీ



భూపాలపల్లి, న్యూస్‌టుడే : నియోజకవర్గంలో పశుసంవర్ధక శాఖకు సంబంధించిన అంబులెన్స్(1962)లను తెలంగాణ రాష్ట్ర పశువైద్యశాఖ ప్రోగ్రాం మేనేజర్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా మేనేజర్ శివకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఎలాంటి మందులు అందుబాటులో ఉన్నాయి..? వాహనాల పనితీరు, తదితర రికార్డులను పరిశీలించారు. నిత్యం అందుబాటులో ఉంటూ, మూగజీవాలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని శివకుమార్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ మెరుగు నరేష్, సిబ్బంది రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.